కాలనీల్లో పర్యటించిన బడంగ్‌పేట మేయర్

బోనాల ఏర్పాట్లను పరిశీలిస్తున్న మేయర్ పారిజాతనర్సింహారెడ్డి

బడంగ్‌పేట, జూలై14 : బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని గ్రీన్‌రిచ్ కాలనీ, శ్రీవిద్య టౌన్‌షిప్‌లో బోనాల ఉత్సవ ఏర్పాట్లను ఆదివారం మేయర్ పారిజాతనర్సింహారెడ్డి పరిశీలించారు. అల్మాస్‌గూడలోని తిరుమలనగర్‌లో జరిగిన సిత్లా పండుగ కార్యక్రమంలో పాల్గొన్నారు. కాలనీల్లో పర్యటించి బోనాల పండుగకు త్వరగా ఏర్పాట్లు పూర్తి చేయాలని నిర్వాహకులకు సూచించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు, కాలనీ అసోసియేషన్ నాయకులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ తెలంగాణ ప్రజలను మోసం చేసింది..

ఆరు గ్యారెంటీల దరఖాస్తు ఫారాలను చూపుతున్న సహదేవ్‌యాదవ్, తదితరులు

మాదన్నపేట, జూలై 14 : కాంగ్రెస్ పార్టీ అధికారాన్ని పొందడానికి తెలంగాణ ప్రజలను మోసగించిందని బీజేపీ జాతీయ కౌన్సిల్ సభ్యుడు, మాజీ కార్పొరేటర్ సహదేవ్‌యాదవ్ అన్నారు. ఆదివారం కుర్మగూడలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. కాంగ్రెస్ నాయకులు ఇచ్చిన ఆరు హామీల అమలు ఎక్కడ జరుగుతుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ప్రశ్నించారు. నిరుపేదలు ఆరు హామీల అమలు కోసం ఎదురుచూస్తున్నారని వెంటనే అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఆయన వెంట బీజేపీ జిల్లా కార్యదర్శి ఉగాది మహేశ్, యాకుత్‌పూర కన్వీనర్ బండ వెంకట్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.

కాలనీల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి

- మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి
- పలు కాలనీల్లో పర్యటన

బడంగ్‌పేట, జూలై14 : కాలనీల్లో ప్రజల అవసరమైన మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తానని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి అన్నారు. బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని వివిధ కాలనీల్లో ఆదివారం ఎమ్మెల్యే పర్యటించారు. అల్మాస్‌గూడ తిరుమల్‌నగర్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు రామిడి రాంరెడ్డి తల్లి రామిడి కళావతి పేరుతో నిర్మించిన కమ్యూనిటీ హాల్‌ను ఎమ్మెల్యే స్థానిక కార్పొరేటర్ రామిడి కవితా రాంరెడ్డితో కలిసి ప్రారంభించారు. నాదర్‌గుల్‌లోని చాణక్యపురి కాలనీ అసోసియేషన్ వారు ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొన్నారు. అ పార్కును సందర్శించగా పార్కులో సౌకర్యాలు కల్పించాలని వేణుగోపాల్‌రావు ఆధ్వర్యంలో ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. అదేవిధంగా జిల్లెలగూడలో సమస్యలు పరిష్కరించాలని కార్పొరేటర్ ఏనుగుల అనిల్ కుమార్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యేకు వినతి పత్రం అందజేశారు. అనంతరం దివ్యాంగులకు ట్రై సైకిల్స్ అందజేశారు. వివిధ కాలనీ వాసుల విజ్ఞప్తి మేరకు ఎమ్మెల్యే కాలనీల్లో పర్యటించారు. కమ్యూనిటీ హాల్ నిర్మించాలని మంత్రికి మొరపెట్టుకున్నారు. సమస్యలను దశల వారీగా పరిష్కరిస్తామని ఎమ్మెల్యే ప్రజలకు సూచించారు. రోడ్లు, డ్రైనేజీ, తాగునీటి సమస్యలను త్వరగా పరిష్కరించడానికి అధికారులతో మాట్లాడుతానని పేర్కొన్నారు. కార్యక్రమంలో పలువురు కార్పొరేటర్లు, బీఆర్ఎస్ నాయకులు, కాలనీ అసోసియేషన్ నాయకులు పాల్గొన్నారు.

కందుకూరు : క్యాంపు కార్యాలయంలో దివ్యాంగులకు ట్రై సైకిళ్లను అందజేస్తున్న ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి

చాణక్యపురి కాలనీలో మాట్లాడుతున్న మహేశ్వరం ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి

దివ్యాంగుల సమస్యల పరిష్కారానికి కృషి : ఎమ్మెల్యే

కందుకూరు : దివ్యాంగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి అన్నారు. ఆదివారం తన క్యాంపు కార్యాలయం వద్ద ఎమ్మెల్యే మండలంలోని కటికపల్లి గ్రామానికి చెందిన సుధాకర్, మన్నెగూడ గ్రామానికి చెందిన పలువురికి ట్రై సైకిళ్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం దివ్యాంగుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ హామీలను నెరవేర్చడంతో పాటు పింఛన్లను పెంచాలని డిమాండ్ చేశారు. నియోజకవర్గంలోని సమస్యలను ప్రజలు తన దృష్టికి తెస్తే పరిష్కరిస్తానని చెప్పారు. కార్యక్రమంలో దాసర్లపల్లి మాజీ సర్పంచ్ తాండ్ర దేవేందర్, మాజీ ఎంపీటీసీ రాజు, బీఆర్ఎస్ యువ నాయకులు ఎడ్ల ఉదయ్ ముదిరాజ్, కార్యకర్తలు పాల్గొన్నారు.

రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు

కందుకూరులో రేషన్ దుకాణాన్ని తనిఖీ చేస్తున్న నాయబ్ తాసీల్దార్ రఘునందన్

కందుకూరు, జూలై 14: రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎన్‌ఫోర్స్‌మెంట్ నాయబ్ తాసీల్దార్ రఘునందన్ హెచ్చరించారు. ఆదివారం నాయబ్ తాసీల్దార్ మండలంలోని వివిధ గ్రామాల్లోని రేషన్ షాపులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. లబ్ధిదారులు రేషన్ షాపుల్లో బియ్యం తీసుకుని దళారులకు విక్రయిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, బియ్యం కొనుగోలు చేస్తున్న వ్యక్తులను గుర్తించి వారిపై పీడీ యాక్టును నమోదు చెస్తామని హెచ్చరించారు. అదేవిధంగా డీలర్లు కొందరు లబ్ధిదారుల వద్ద బియ్యం కొనుగోలు చేసి ఎక్కువ ధరలకు రైస్ మిల్లర్లకు విక్రయిస్తున్నట్లు సమాచారం ఉందని, అలాంటి డీలర్ల దుకాణాలను రద్దు చేసి కేసులు నమోదు చేస్తామని ఆయన హెచ్చరించారు. బియ్యం కొనుగోలు చేసే రైస్ మిల్లర్ల యజమానులపైనా చర్యలు తీసుకుంటామని తెలిపారు. లబ్ధిదారులు బియ్యాన్ని ఎవరికీ విక్రయించవద్దని సూచించారు.

సీఎంఆర్ఎఫ్‌తో పేదల ఆరోగ్యానికి భరోసా

సత్యంకు సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేస్తున్న లింగోజిగూడ కార్పొరేటర్ డీ. రాజశేఖర్‌రెడ్డి

చంపాపేట, జూలై 14 : పేదలకు మెరుగైన ఆరోగ్యం అందించేందుకు ముఖ్యమంత్రి సహాయనిధి అండగా నిలుస్తున్నదని జీహెచ్ఎంసీ కాంగ్రెస్ పార్టీ ఫ్లోర్‌లీడర్, లింగోజిగూడ కార్పొరేటర్ ధర్పల్లి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. భాగ్యనగర్ కాలనీకి చెందిన సత్యం అనారోగ్యంతో ప్రైవేట్ హాస్పిటల్లో చేరాడు. ఆర్థిక స్థోమత లేక బాధితుడి కుటుంబ బసభ్యులు కార్పొరేటర్ రాజశేఖర్‌రెడ్డిని ఆశ్రయించారు. కార్పొరేటర్ చొరవతో ముఖ్యమంత్రి సహాయనిధికి దరఖాస్తు చేసుకోగా రూ. 30వేల చెక్కు మంజూరైంది. ఆదివారం కార్పొరేటర్ రాజశేఖర్‌రెడ్డి ఆ చెక్కును బాధితుడు సత్యంకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేదల వైద్యానికి సీఎంఆర్ఎఫ్ భరోసా ఇస్తున్నదని పేర్కొన్నారు. నాయకులు శ్రీధర్‌రెడ్డి, రోహిత్, నరేందర్, భాస్కర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఏకలవ్య ఎరుకల కార్పొరేషన్ చైర్మన్‌గా సత్యనారాయణను నియమించాలి

విలేకరులతో మాట్లాడుతున్న వనం గంగయ్య, తదితరులు

మన్సూరాబాద్, జూలై 14: ఎరుకల కులస్తుల అభ్యున్నతికి ప్రభుత్వం ఏకలవ్య ఎరుకల కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయడం అభినందనీయమని తెలంగాణ ప్రదేశ్ ఎరుకల సంఘం రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు వనం గంగయ్య అన్నారు. మన్సూరాబాద్ డివిజన్ పరిధి ఎరుకల నాంచారమ్మకాలనీలో ఆదివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు బుడ్డ సత్యనారాయణను ఏకలవ్య ఎరుకల కార్పొరేషన్ చైర్మన్‌గా నియమించాలని కోరారు. కార్యక్రమంలో చర్ల రమేశ్, చిన్నన్రసింహ, ధనుంజయ, వీరేశం, గోపాల్, యాదయ్య, జానీ, గణేశ్ తదితరులు పాల్గొన్నారు.

పారా అథ్లెటిక్స్ జాతీయ పోటీల్లో సత్తా చాటాలి

- అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు ముత్తినేని వీరయ్య వర్మ
- క్రీడాకారులకు టీ షర్టులు పంపిణీ

మలక్‌పేట, జూలై 14: జాతీయ స్థాయి పారా అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీల్లో సత్తా చాటి రాష్ట్రానికి పేరు తేవాలని పారా అథ్లెటిక్స్ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు, రాష్ట్ర దివ్యాంగుల ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ముత్తినేని వీరయ్య వర్మ అన్నారు. తెలంగాణ పారా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 15 నుంచి 17 వరకు బెంగుళూరులో జరుగనున్న 13వ జాతీయ స్థాయి జూనియర్ అండ్ సబ్ జూనియర్ పారా అథ్లెటిక్ చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొననున్న 15 మంది రాష్ట్ర క్రీడాకారులకు అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆయన టీ షర్ట్‌లను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా వీరయ్య వర్మ మాట్లాడుతూ దివ్యాంగులను క్రీడల్లో ప్రోత్సహించేలా స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ క్రీడల్లో పారాఅథ్లెటిక్స్ క్రీడలను చేర్చుతూ ఉత్తర్వులు జారీచేసిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కాగా ఈ పోటీలకు ఇద్దరు కోచ్‌లు, ఇద్దరు మేనేజర్లు ప్రాతినిధ్యం వహిస్తున్నారని పారా అథ్లెటిక్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి గడిపల్లి ప్రశాంత్ తెలిపారు. క్రీడల్లో మెరుగ్గా రాణించాలని ఆకాంక్షించారు.

పారా అథ్లెటిక్ క్రీడాకారులకు టీషర్ట్‌లను పంపిణీ చేసిన అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు, దివ్యాంగుల ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ముత్తినేని వీరయ్య వర్మ

రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ నూతన చైర్మన్‌గా డాక్టర్ రియాజ్

సుల్తాన్‌బజార్, జూలై 14 : తెలంగాణ రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ నూతన చైర్మన్‌గా డాక్టర్ రియాజ్ ఆదివారం అప్జల్‌గంజ్‌లోని రాష్ట్ర కేంద్ర గ్రంథాలయంలో ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, పలువురు ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు, పౌర గ్రంథాలయశాఖ ఉన్నతాధికారుల సమక్షంలో పదవీ బాధ్యతలు స్వీకరించారు. వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు, పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి, జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు, పౌర గ్రంథాలయాల ఉద్యోగులు రియాజ్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

పద్మావతికాలనీ నూతన కార్యవర్గం

మన్సూరాబాద్, జూలై 14: డివిజన్ పరిధిలోని పద్మావతికాలనీ సంక్షేమ సంఘం సర్వసభ్య సమావేశం ఆదివారం స్థానిక కమ్యూనిటీ హాల్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కంచర్ల విజయభాస్కర్‌రెడ్డి, ఉపాధ్యక్షులుగా తిరుమల శ్రీనివాసులు, కాసుల నరసింహారెడ్డి, ప్రధానకార్యదర్శిగా భాస్కరాచారి, కోశాధికారిగా వై. పద్మారెడ్డి, కార్యనిర్వాహక కార్యదర్శులుగా రఘునాథ్‌రెడ్డి, మహేశ్ తదితరులను ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారులుగా బోల్ల రాంరెడ్డి, సత్యనారాయణ, వీరారెడ్డి, నవనీతరావు, గోవర్ధన్ వ్యవహరించారు. కాలనీలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని నూతన అధ్యక్షుడు విజయభాస్కర్‌రెడ్డి పేర్కొన్నారు.

వైభవంగా జగన్నాథస్వామి రథయాత్ర



జగన్నాథ స్వామి రథయాత్రలో పాల్గొన్న చిలుక ఉపేందర్‌రెడ్డి తదితరులు

ఆర్కేపురం, జూలై 14 : ఇస్కాన్ సొసైటీ ఆధ్వర్యంలో శ్రీరామకృష్ణాపురం కాలనీలో జగన్నాథ స్వామి రథయాత్ర వైభవంగా నిర్వహించారు. కాలనీ వాసులు, భక్తులు వేల సంఖ్యలో పాల్గొని శ్రీకృష్ణ నామస్మరణ చేస్తూ ఆధ్మాత్మిక అనుభూతి పొందారు. చిన్నారులు, వృద్ధులు పోటాపోటీగా రథాన్ని లాగారు. రథయాత్రలో స్థానిక కార్పొరేటర్ రాధాధీరజ్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర యువజన నాయకుడు చిలుక ఉపేందర్‌రెడ్డి, కాలనీ సొసైటీ సభ్యులు రమేశ్‌బాబు, రాజశ్రీరామారావు, వెంకటేశ్వర్లు, నరహరిరావు, ఆంజనేయప్రసాద్, గణేశ్‌బాబు,భరత్, శ్రవణ్, అన్నపూర్ణ, విజయలక్ష్మి, రాధ, నీలిమ, సుజాత, మునిపల్లె శ్రీనివాస్, ఇస్కాన్ ప్రతినిధులు శ్రీనివాస్, నరసింగ్‌రావు పాల్గొన్నారు.

రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం

ఉచిత వైద్య శిబిరంలో పాల్గొన్న వృద్ధులు

మన్సూరాబాద్, జూలై 14: ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ రంగారెడ్డి జిల్లా శాఖ ఆధ్వర్యంలో సీనియర్ సిటిజన్స్‌కు ఆదివారం నాగోల్ డివిజన్ పరిధి కోఆపరేటివ్ బ్యాంకు కాలనీ కమ్యూనిటీ హాల్‌లో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. బీపీ, షుగర్, ఆర్థోపెడిక్ తదితర పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులను ఉచితంగా పంపిణీ చేశారు. సుమారు వంద మంది సీనియర్ సిటిజన్స్ పాల్గొన్నారు. కార్యక్రమంలో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ రంగారెడ్డి జిల్లా శాఖ అధ్యక్షుడు నర్సింహారెడ్డి పాల్గొని మాట్లాడారు. వైస్‌చైర్మన్ పాండుగౌడ్, సలహాదారుడు డాక్టర్ శ్రీరాములు, కోశాధికారి రాఘవరెడ్డి, సభ్యులు నరేందర్‌రెడ్డి, మురళీధర్, కోఆపరేటివ్ బ్యాంకు కాలనీ సీనియర్ సిటిజన్ ఫోరమ్ అధ్యక్షుడు అశోక్‌కుమార్, కార్యదర్శి నర్సింహారెడ్డి, ఉపాధ్యక్షులు కోటిరెడ్డి, అశోక్‌కుమార్, కృపాకర్, చీమయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు సోషల్ మీడియాకు దూరంగా ఉండాలి

ఫ్రెషర్స్ డే వేడుకల్లో డ్యాన్స్ చేస్తున్న విద్యార్థులు

ఆర్కేపురం, జూలై 14 : విద్యార్థులు సామాజిక మాధ్యమాలకు దూరంగా ఉండాలని భాష్యం పాఠశాలల జెడ్ఈఓ అంకమ్మరావు అన్నారు. ఆదివారం ఆర్కేపురం డివిజన్ భాష్యం స్కూల్‌లో ఫ్రెషర్స్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అంకమ్మరావు మాట్లాడుతూ.. విద్యార్థులు సెల్‌ఫోన్లో సమయాన్ని గడపకుండా చదువుపై శ్రద్ధ చూపాలన్నారు. పాఠశాల ప్రిన్సిపాల్ అప్పారావు మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నతమైన లక్ష్యాన్ని ఏర్పరుచుకొని ముందుకు సాగాలని సూచించారు. కష్టపడి చదివి తల్లిదండ్రులు, పాఠశాలకు పేరు ప్రతిష్టలు తీసుకురావాలని ఆయన ఆకాంక్షించారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులు అందజేశారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

రామంతాపూర్,జూలై 14 : చిలుకానగర్ డివిజన్ పరిధిలోని నార్త్ కల్యాణపురిలో రూ.35 లక్షల వ్యయంతో సీసీ రోడ్డు పనులను ఆదివారం ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి స్థానిక కార్పొరేటర్ బన్నాల గీతా ప్రవీణ్‌తో కలిసి ప్రారంభించారు.చిలుకానగర్ అన్ని విధాలుగా అభివృద్ధిలో ముందుకు సాగుతుందన్నారు.దశల వారీగా పెండింగ్ పనులను పూర్తి చేస్తామన్నారు. కార్పొరేటర్ గీతా మాట్లాడుతూ డివిజన్‌లోని అన్ని ప్రాంతాలను సమన్యాయం చేస్తూ అభివృద్ధి చేస్తున్నామన్నారు. ఎమ్మెల్యే సహకారంతో మరింత అభివృద్ధి చేస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు కొండల్‌రెడ్డి, జగన్, బింగిశ్రీనివాస్, శ్రీనివాస్‌యాదవ్, నరేశ్, రవీందర్ రెడ్డి, కాలనీవాసులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ

ఉప్పల్, జూలై 14: నాచారంలోని సావర్కర్‌నగర్‌లో మున్నూరు కాపు సంఘం భవ నం ప్రాంతంలో ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మున్నూరు కాపు సంఘం నాయకుల ఆధ్వర్యంలో పలువురు విద్యార్థులకు ఉచితంగా నోటు పుస్తకాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ముఖ్యసలహాదారు చంద్రయ్య, గీత, నిర్మల, ప్రొ. సత్యనారాయణ, భూపాల్, మల్లేష్, అధ్యక్షుడు వెంకటేష్, ప్రధాన కార్యదర్శి మహేందర్, కోశాధికారి యాదగిరి, సభ్యులు రాజిరెడ్డి, వెంకటేష్, శ్రీనివాస్, నరసింహ పాల్గొన్నారు.

'వష్టి' కథా సంపుటి ఆవిష్కరణ

ముషీరాబాద్, జూలై 14: లేఖిని రచయిత్రుల వేదిక ఆధ్వర్యంలో ఆదివారం చిక్కడపల్లి హనుమంతరావు వేదికలో రచయిత్రి శైలాజామిత్ర రచించిన వష్టి కథా సంపుటి ఆవిష్కరణ సభ జరిగింది. రచయిత సయ్యద్ సలీం సంపుటిని ఆవిష్కరించారు.

ఉత్సాహంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనాలు

కందుకూరులో ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు

కందుకూరు, జూలై 14 : కందుకూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2003-04 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు ఆదివారం మండలకేంద్రంలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. నాడు తమకు విద్యాబుద్ధులు నేర్పించిన ఉపాధ్యాయులను ఆహ్వానించి ఘనంగా సన్మానించారు. తమ చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. తరగతి గదుల్లో చేసిన అల్లరిని గుర్తు చేసుకున్నారు. అంతా కలిసి ఒకే చోట సహపంక్తి భోజనం చేసి రోజంతా ఆనందంగా గడిపారు. కార్యక్రమంలో నాటి హెచ్ఎం చంద్రమోహన్‌రెడ్డి, ఉపాధ్యాయులు ఆయూబ్, లక్ష్మారెడ్డి, ఆనంద్‌కుమార్, నర్సింహ, శ్రీనివాస్, రమేశ్, లక్ష్మీ, మైత్రి, కనకమహాలక్ష్మి, శ్రీనివాస్, విద్యార్థులు పాల్గొన్నారు.

వనస్థలిపురం : ఆకుతోటపల్లి గ్రామ పదో తరగతి బ్యాచ్ పూర్వవిద్యార్థులు

హస్తినాపురంలో..

వనస్థలిపురం : రంగారెడ్డి జిల్లా ఆకుతోటపల్లి గ్రామానికి చెందిన 1995-96 పదో తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థులు హస్తినాపురంలో ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా తమ జ్ఞాపకాలను గుర్తు చేసుకుని మైమరచిపోయారు. కార్యక్రమంలో వీరేశ్‌గౌడ్, శ్రీను, సంతోష్‌కుమార్‌రెడ్డి, సుధాకర్, ప్రసాద్, రాజశేఖర్, నరసింహగౌడ్, బాలస్వామి, సత్తార్, తదితరులు పాల్గొన్నారు.

బడంగ్‌పేటలో...

బడంగ్‌పేట : బడంగ్‌పేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన 2002-03 పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా తమకు చదువు చెప్పిన ఉపాధ్యాయులు విజయలక్ష్మి, రమణమ్మ, వైజయంతి, మధు, పరమేశ్వర్, రాధిక, చంద్రకళను సత్కరించారు. పాత జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. రోజంతా సంబురాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు యాదగిరిచారి, శ్రీనివాస్, రామకృష్ణ, భాస్కర్, రేవంత్, వినోదచారి, విజయ్, కృష్ణ, వెంకటేశ్, సాయిబాబా, తదితరులు పాల్గొన్నారు.

సమ్మేళనంలో పాల్గొన్న బడంగ్‌పేట ప్రభుత్వ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు

దివ్యాంగుల ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్‌కు శుభాకాంక్షలు

మలక్‌పేట,జూలై 14: రాష్ట్ర దివ్యాంగుల ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ముత్తినేని వీరయ్యవర్మకు ఆదివారం పలు సంఘాల నాయకులు, సభ్యులు శుభాకాంక్షలు తెలిపారు. నల్లగొండ చౌరస్తాలోని దివ్యాంగుల సహకార సంస్థ కార్యాలయంలో చైర్మన్ ముత్తినేని వీరయ్య వర్మను డిఫరెంట్ ఏబుల్డ్ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు షేక్ వాబీబ్ మియా, గౌరవాధ్యక్షులు ముక్కు నర్సయ్య, ఎన్పీడీఓ ఎం.శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శి లక్ష్మయ్య, తదితరులు పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా వారు పలు సమస్యలను చైర్మన్‌కు విన్నవించారు. సానుకూలంగా స్పందించిన చైర్మన్ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో దివ్యాంగులు వేదకుమారి, రామకృష్ణ, పరమేశ్, నరేశ్, పురుషోత్తంరెడ్డి, రాము, కొండలు, తదితరులు పాల్గొన్నారు.

వాన జోరు.. జనం బేజారు..

మలక్‌పేట పరిసర ప్రాంతాల్లో ఆదివారం రాత్రి కురిసిన వర్షానికి రోడ్లు జలమయమై వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. మాన్‌సూన్ సిబ్బంది సహాయక చర్యలో పాల్గొన్నారు. పాదచారులు బిక్కుబిక్కుమంటూ నీటి ప్రవాహంలో నడుచుకుంటూ వెళ్లారు.

అన్ని డివిజన్లను అభివృద్ధి చేస్తాం : ఎంపీ

నేరేడ్‌మెట్, జూలై 14: మల్కాజిగిరి నియోజవర్గంలోని ప్రతి డివిజన్ అభివృద్ధి కృషి చేస్తామని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. ఆదివారం వినాయకనగర్ డివిజన్‌లో స్థానిక కార్పొరేటర్ క్యానం రాజ్యలక్ష్మి, మౌలాలి కార్పొరేటర్ సునితతో కలిసి ఆయన పర్యటించారు. స్థానికులు ఎంపీ ఈటలకు ప్రజలు ఎదుర్కొంటున్న పలు సమస్యలను వివరించారు. అందుకు ఎంపీ స్పందించి సంబంధిత అధికారులతో మాట్లాడి కాలనీల్లో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని చెప్పారు. మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో మాజీ బీజేవైఎం అధ్యక్షులు భానుప్రకాష్, నాయకులు శేఖర్ యాదవ్, నర్సింహారావు, నవీన్, శ్రవణ్ పాల్గొన్నారు.

వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి : ఎమ్మెల్యే

గోల్నాక, జూలై 14 : ఉచిత వైద్య శిబిరాలను స్థానికులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ కోరారు. ఆదివారం అగర్వాల్ సేవామంచ్, రెనోవా హాస్పిటల్ సంయుక్త ఆధ్వర్యంలో అంబర్‌పేట డివిజన్ బాపునగర్ ప్రగతి విద్యానికేతన్ హైస్కూల్లో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని స్థానిక కార్పొరేటర్ విజయ్ కుమార్ గౌడ్ తో కలసి హాజరై ఆయన ప్రాంభించారు. ఈ శిబిరంలో నేత్ర, దంత, ఈఎన్‌టీ విభాగాలకు సంబంధించిన పలువురు వ్యాధిగ్రస్తులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు.

ఆత్మరక్షణకు కరాటే నేర్చుకోవాలి..

ప్రతి ఒక్కరూ ఆత్మరక్షణకు కరాటే నేర్చుకోవాలని ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ అన్నారు. ఆదివారం గోల్నాకలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో గోల్డెన్ డ్రాగన్ కరాటే ఆకాడమీ ఏర్పాటు చేసిన చాంపియన్‌షిప్ పోటీల్లో విజేతలైన విద్యార్థులకు ఎమ్మెల్యే సర్టిఫికెట్లతోపాటు మెడల్స్ అందజేశారు.